


# ఈ పిల్ల నాకొద్దు

-వి. మంగతాయారు

'పాపా! బావి దగ్గరకు పోయి ఓ బిందెడు నీళ్లు తెచ్చి పెడతావా?'

'అబ్బబ్బ, అమ్మా నేను తేను. నా బట్టలు తడుస్తాయి. ఇంటికొచ్చావంటే చాలు, ఏదో ఒక పని చెబుతావు' అంది పడుకునే ఏదో వారపత్రిక తిరగేస్తూ.

ఈ మాటలు విన్న శాయమ్మకి ఒళ్ళు మండింది. 'ఏంటే మల్లీ, పొద్దుటనగా పొలం కాడికి పోయి పొద్దుమీకిప్పుడు అచ్చింది కదా. గిన్ని నీళ్లు తెమ్మంటే నీకు శాత కాదా? అయినా గింత పెరిగినవు, పదారు, పదేడేళ్ళకి, తల్లి అచ్చేటేలకి ఏమున్నయో అరుసుకోవద్దా. ఎంతసేపూ సోకులు సేసుకోనే సరిపోతాంది. మీదికెల్లి ఓ పుత్తకం సేతిలో. అలా అని గా సదువన్న సక్కగ యలగబెట్టినవా అంటీ అదీ లేదు. పది తప్పినవు. ఇంట్లో కూసున్నవు ఇగ సదవనని. తల్లికి గా మాత్రం సాయం సెయ్యవా?' అని కేకలేసింది మనుమరాలిని.

'ఇదిగో నాయనమ్మా 'మల్లి, గల్లి' అన్నావంటే ఊరుకోను. నా పేరు 'మల్లిక' మా అమ్మే ఏమీ అనదు గాని నువ్వెందుకు గొణుగుతావు' అంది మల్లిక.

వింటున్న రాధమ్మ 'అత్తా, దానితోనేంటి. నీళ్లు నె తెస్తా గాని, నువ్వూరుకో నీకు దండం పెడతా' అంటూ బిందె తీసుకుని నీళ్లు తేడానికెళ్లింది.

'ఇదిగో, ఇలాగే గావురం సేసి నెత్తి కెక్కించుకుంటోంది. ఒకింటికి పోవలసిన పిల్ల గిట్ల పెంచితే ఎట్లా? మంచి సెడు, ఏమన్నా ఎరకవుతున్నాయా గా పిల్లకు. ఇట్ల పెరిగిన దాన్ని రేపెవరు సేసుకుంటారు?'

'ఏంటి నాయనమ్మోయ్! ఇంట్లోంచి గెంటెద్దామని చూస్తున్నావా? అదేం పెట్టుకోకు. పెళ్లిగిళ్లి జాన్‌తానయ్. పెళ్ళి చేసుకుని చాకిరీలు చేసుకుంటూ పిల్లల్ని కంటూ కూర్చుంటా ననుకుంటున్నావా! నే పెళ్ళి చేసుకోను, హాయిగా దర్జాగా ఇలాగే ఉంటా'

'ఉంటావు, ఉండవు మరి. అటు అది రెక్కలు ముక్కలు సేసుకుంటోంది. పాపం, బిడ్డ ఒంటిచేత్తో నిన్ను, నన్ను సాకుతోంది. నా కొడుకు పోయినా నా బరువు తలకెత్తుకుంది. అసంటి దాని కడుపున ఈ పొగరు బోతుది ఎట్ల పుట్టిందో?'

ఇంతలో నీళ్ల బిందెతో తిరిగి వచ్చిన రాధమ్మ 'మల్లికా, ఏంటమ్మా, నాయనమ్మతో పెట్టుకుంటున్నావు. మన మంచి చెడ్డలు చూసే పెద్ద దిక్కమ్మా. అట్లా మాట్లాడకు బిడ్డా. నువ్వు కూడా అన్నీ నేర్వాలి. మంచి చెడు తెలుసుకోవాలి. రేపు పెండ్లయి ఇంకో ఇంటికి పోతే గిట్లనే ఉంటావా? అందరూ ఏమంటారు?'

'ఏమంటే దానికేం. అదయితే పని పాట్లు సెయ్యకుండా 'టింగు రంగా' మని ముస్తాబై ఓ పుత్తకం పట్టుకుని కూసుంటుంది. ఆళ్లు తిడితే, నిన్నే తిడతారు. 'ఇదేం పెంపకం' అని. అక్కడికీ, వాకిలూడ్చుడు. గిన్నెలు కడుగుడు లాంటి సిన్న పనులు చేత్తా వున్నా సేతగాకున్నా' అంటూ కూర్చుంది శాయమ్మ.

* * *

ఇదీ మల్లిక! పల్లెటూర్లో పెరిగినా అందంగా ఆకర్షణీయంగా ఉండాలనే తాపత్రయం. బారెడు జడ, పెద్దపెద్ద కళ్ళు, పసిమి ఛాయ... బాపుగారి బొమ్మలా స్వతహాగా చక్కనిదే కావడం అతిశయానికి దోహదపడుతోంది; చక్కగా తయారవుతుంది. అందం చెడకూడదు. పెళ్ళి చేసుకోనంటుంది. పిల్లలు పుడితే అందం పాడవుతుందని ఎక్కడో చదివిన దాన్ని ఒంటపట్టించుకుంది. తల్లికి అపురూపం. ఎలాగో చేసి అడిగినదల్లా ఇస్తుంది. దాన్ని సౌందర్య పోషకాలకు ఖర్చు పెడుతుంది. మల్లిక నెలల పిల్లగా వున్నప్పుడే తండ్రిని పోగొట్టుకుంది. అన్నీ తానై అటు అత్తగారిని, ఇటు ఈ పాపాయి (మల్లిక)ని పెంచుతోంది రాధమ్మ. వ్యవసాయ పనులు చేస్తూ, చేయిస్తూ. 'పదిహేడేళ్లు వచ్చాయి. పిల్లకు పెళ్ళి చెయ్యవా రాధమ్మా' అంటున్నారందరూ. ఇటు అత్తగారు కూడా 'అమ్మా, దాన్ని ఓ ఇంటి దాన్ని సెయ్యాల బిడ్డా' అంటూనే ఉంది. తెలిసిన వాళ్ళకు చెప్పి మంచి సంబంధం చూడమంటూనే ఉంది. పిల్లదాన్ని చదివిద్దామని బడిలో వేసింది. కాని ఆ పిల్లకు చదువు పట్ల ఆసక్తి తక్కువ. వయసు పెరుగుతున్న కొద్దీ అందచందాలను పోషించుకోవాలనే తాపత్రయం ఎక్కువయింది. పరీక్ష పోయింది (పదవ తరగతి) కాని విషయ పరిజ్ఞానం బాగానే ఉంది. గారంగా పెరిగిందేమో తనెంతంటే అంతే... మంకుతనం ఎక్కువ. ఏదైనా తన కిష్టం కానిది వద్దనుకుంటే... అంతే... వద్దే! ఒకోసారి రాధమ్మ, శాయమ్మ కూడా బెంగపడుతూ ఉంటారు. 'ఈ పిల్ల ఇలా ఉంటే ఎవరు చేసుకుంటారు? అత్తవారింట్లో ఎలా మెలుగుతుంది' అని. 'కుర్రతనం, పెండ్లయితే అన్ని సక్కబడతయిలే' అని కోడలికి నచ్చజెబుతూ వుంటుంది శాయమ్మ.

మల్లికకు పెళ్ళి ఘడియలు రానే వచ్చాయి. మంచి సంబంధం కుదిరింది, వీళ్ల వీధిలోనే ఉండే రంగయ్య తాత పుణ్యమా అని. పక్కవూరే. పెద్ద పట్నం కాదు, చిన్న పల్లె కాదు, వ్యవసాయ కుటుంబానికి చెందిన రమేశ్‌తో.

మొదట పెళ్లి వద్దని పేచీ పెట్టింది. రంగయ్య తాత నచ్చజెప్పి ఒప్పించి, పెళ్ళి జరిపించారు. రమేశ్ చక్కని వాడే. పదవ తరగతి పాసయ్యాడు. సహృదయుడు. తల్లి రమణమ్మకు ప్రాణం. తండ్రి పోయినా కొడుకును చక్కగా పెంచింది. చదువు సంధ్యలు లేకపోయినా మంచి సంస్కారవంతురాలు, బంధుమిత్రుల గౌరవాభిమానాల నందుకుంటోంది రమణమ్మ! 'మల్లిక అదృష్టవంతురాలు. అంత మంచి ఇంటి కోడలయింద'ని అందరూ అనుకుంటూ ఉంటారు.

ఇంటికి వచ్చిన మల్లిక, నిజానికి కోడలైనా రమణమ్మ దృష్టిలో కూతురే. ఎంతో ఆప్యాయంగా చూసుకుంటుంది. పుట్టింట్లో కంటే ఎక్కువగా సుఖపడుతోంది మల్లిక. ప్రేమాభిమానాలు పంచే భర్త, పల్లెత్తు మాటన కుండా ఆప్యాయతానురాగాలు అందించే అత్త! ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టే పని లేదు మల్లికకు. చక్కగా అలంకరించుకుని మహారాణిలా కూర్చోవడమే పని. దాంతో మల్లికలో సహజంగా ఉండే గర్వం, మంకుతనం ఏ మాత్రం తగ్గలేదు సరి కదా ఇంకా పెరుగుతున్నాయి. అక్కడ తల్లికి మాత్రం ఈ పోకడ నచ్చడంలేదు. ఏ రోజు ఏ మాట వినవలసి, పడవలసి వస్తుందోనని భయపడుతూనే కాలం గడుపుతోంది. అత్తగారితో అంటే 'దాని అత్త గావురంగానే సూత్తోంది కదా, దానికే తెలుత్తయిలే. పెండ్లయింది కదా' అని నచ్చచెపుతోంది. మల్లిక పెళ్లయి రెండు సంవత్సరాలు దాటింది.

మల్లిక తల్లి కాబోతోందని తెలిసి అత్తింట్లో పుట్టింట్లో అందరూ ఎంతో సంతోషపడ్డారు. మల్లిక తల్లి మాత్రం సంతోషంగా ఉన్నా భయపడిపోతోంది (కూతురు మనస్తత్వం తెలిసింది కనుక) ఏం గొడవలు తెస్తుందో'నని. మల్లికకు మాత్రం 'ఇదే... తల్లి కావడ ఇష్టం లేదు. ఆ మాటే భర్తతో అంది. 'ఎబార్షన్' చేయించమని గొడవ చేసింది. నచ్చజెప్పినా వినకపోయేసరికి రమేశ్‌కి కోపం వచ్చి 'ఛ. నోర్మూయ్. అవేం మాటలు. చెబితే వినవేం. మా ఇంట్లో 'పిల్లో, పిల్లాడో' తిరుగాడే రోజు రాబోతోందని మా అమ్మ ఎంత సంతోషంగా ఉందో తెలుసా? మా అమ్మ విందంటే బాధపడుతుంది. నీ మీద ఉన్న మంచి అభిప్రాయం పోతుంది. ఈ విషయం మా అమ్మ దాకా పోనియ్యకు. పిచ్చిపిచ్చి ఆలోచనలు మానెయ్యి' అని గట్టిగానే మందలించాడు.

అసలే తల్లి కావడం ఇష్టం లేదు. పైగా రమేశ్ 'పిల్లో,

పిల్లాడో' అన్నాడు. 'పిల్ల' ఆడపిల్ల... అంటే తనకి ఇష్టం లేదు. అసహ్యం. ఎందుకో తనకే తెలియదేమో! చివరకు మల్లికకు 'ఆడపుల్లే' పుట్టింది. వత్తుగా ఉంగరాల జుట్టు, పెద్దపెద్ద కళ్లు, తెల్లగా అందంగా ఉంది పాప. అందరూ మురిసిపోతున్నారు మహలక్ష్మి పుట్టిందని. కాని మల్లిక ఆ పిల్లను అసహ్యించుకుంటూ పాలియ్యనని పేచీ పెట్టింది. అందరూ కోప్పడితే చేసేది లేక పాలిస్తోంది కాని ఏడుస్తున్నా హృదయానికి హత్తుకోదు, ఆప్యాయంగా చూడదు, తనకి పట్టనట్టు ఉంటుంది. అయిందేదో అయింది ఇంక పిల్లలు వద్దనుకుంది. తన ప్రవర్తనలో మార్పులేదు. భర్త, అత్తగారూ ఏదో తెలిసీ తెలియనితనం అని సర్దుకుంటున్నారు. పైగా పాప అంటే వాళ్లకు ప్రాణం. అది పెరుగుతూంటే దాని ముద్దు చేష్టలకు, మాటలకు మురిసిపోతున్నారు. మల్లిక తప్ప. పాప పెంపకమంతా నాయనమ్మదే. ఆమెకు ఆడపిల్లలంటే ఇష్టం. 'పిల్ల తన దగ్గరికి రాదు. ఇదీ తన మేలుకే... ఆ వెధవ చాకిరీలు ఎవరు చేస్తారు' అనుకుంటుంది మల్లిక. ఎప్పుడైనా ఏదైనా చేయవలసి వస్తే ముభావంగా చేసుతందంతే (మూడు నెలలకే పాలియ్యడం మానేసింది) మల్లిక తల్లి వీలున్నప్పుడల్లా వచ్చి పాపను చూసి, పాపతో ఆడుకుని వెడుతూ ఉంటుంది. 'నీ వైఖరి మార్చుకో. బంగారం లాంటి పిల్ల. దగ్గరకు తీసుకోకుండా ఎట్ల వుండ బుద్ధయితోందే నీకు' అంటూ చాటుగా మందలిస్తూనే ఉంది కూతుర్ని రాధమ్మ. ఇలా మూడేళ్లు నిండాయా పాపకి.

మల్లిక నెల తప్పింది మళ్ళీ. 'మళ్ళీ వచ్చింది వెధవ గోల' అంటోంది మల్లిక మనసు. 'నా మాట ఎవరూ వినరు...' ఈ దిగులుతో సరిగ్గా తిండి తినడం మానేసింది. నీరసించింది. రమేశ్ ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. అన్ని పరీక్షలూ జరిగాయి స్కానింగ్‌తోసహా. రమేశ్ మలిలకకు తెలియకుండా అడిగాడు. 'డాక్టర్, పిల్లా, పిల్లాడా?' అని. డాక్టర్ జవాబు విని భయపడిపోయాడు. మల్లికకు తెలిస్తే రాద్ధాంతం చేస్తుందని, డాక్టర్‌కు ఇది వరకు జరిగినదంతా వివరించి చెప్పి తనకు మాత్రం తెలియనియ్యకండి' అని బతిమాలాడు. మల్లిక మాత్రం 'ఇక తప్పదని' అయిష్టంగానే మోస్తోంది కడుపులో పిల్లను. అప్పుడప్పుడు 'ఈసారి పిల్లవాడు పుడతాడేమో' అనుకుని 'ఆ ఎవరైతే నాకేం వాళ్ళే పెంచుకుంటారు. వాళ్ళకి కావాలిట కదా' అని తనను తనే సమాధానపరచుకుంటోంది. ఆ ఆశతోనే ఆస్పత్రి కెళ్ళింది. కాని ఈసారీ పక్కలో ఆడపిల్లను చూసేసరికి ఏడ్చేసింది... 'నాకీ పిల్ల వద్దు... మొదటిదే ఆడపిల్ల అంటే మళ్ళీ మరొకటా? నాకు దీన్ని చూస్తే అసహ్యం. నా దగ్గరకు తేవద్దు' అంటూ 'అయినా, ఈ ఆస్పత్రి వాళ్ళే మార్చేశారేమో ఈ పిల్లల్ని నాకు మగపిల్లవాడు పుట్టి ఉంటాడు. ఈ పిల్లను తీసెయ్యండి. నా పిల్లవాణ్ణి నాకియ్యండి' అంటూ గొడవ మొదలుపెట్టింది. అందరూ చిత్రంగా చూస్తూంటే అత్త, తల్లి, భర్త, అందరూ సిగ్గుతో చితికిపోతున్నారు. ఎంత చెప్పినా వినడం లేదు. నర్సు పోయి, డాక్టర్‌ను పిలుచుకొచ్చింది. డాక్టర్ 'ఏంటమ్మా! ఏంటి? ఏంటీ గొడవ? నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటమేనా? మీ వాళ్లు చూడు ఎంత మర్యాదస్తులుగా ఉన్నారు. నువ్వేమిటీ ఈ తిక్క వేషాలు. తెలిస్తే తెలిసినట్లుండు. లేకపోతే చెప్పినట్లు విను. ఏ పిల్లో నీ చేతుల్లో ఉందా... నువ్వు ఆడదానివి కాదా మరి? పిల్లకు పాలియ్యనంటున్నావుట. నీ పిల్ల నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. ఇక్కడ కాదు. మీ ఇంటి దగ్గర. పైగా పిల్లల్ని మార్చారంటున్నావుట. ఎవరు మారుస్తారు? మాకిదే పనా? ఎప్పుడో, ఎక్కడో, ఏదో జరిగిందని ఇంక అదే మాటా? అందరూ పుట్టిన ఆడపిల్లల్ని మావి కావంటే ఆస్పత్రి వాళ్ళు మగపిల్లల్ని ఎక్కడ నుంచి తెస్తారు? అంత అనుమానం ఉన్న దానివి ఇంట్లోనే పురుడు పోసుకోవలసింది. అంతేకాని మమ్మల్ని బద్‌నామ్ చెయ్యకండి. అసలు 'ఆడపిల్ల' అని వదిలించుకోడాని కిదో ఎత్తు. బాగానే వున్నారు అందరూ' అని రమేశ్‌తో 'ఇక్కడ గొడవ చెయ్యకండయ్యా' అని 'వార్డి మూర్ఖురాలిలా ఉంది. రేపు ఇంటికి పంపేస్తాను' అని విసుక్కుంటూ వెళ్ళిపోయింది డాక్టర్.

అత్త రమణమ్మ 'చూడు బిడ్డా మల్లికా. దేవుడిచ్చిన దానికేం చేత్తాం. పిల్లయితేనేం, పిల్లగాడయితేనేం. ఈ రోజుల్లో అందరూ చదువుతాన్రు మంచిగ. అయినా ఈ బిడ్డకేం, కన్నొంకరా, కాలొంకరా, చందమామ లెక్క చక్కగుంది. 'ఆడదంటావు, అసహ్యమంటావు, నువ్వూ ఆడదానివే కదా. మీ అమ్మ ఇట్లనే చేసుకుంటే నువ్వింట్లుందువా బిడ్డా. బిడ్డలు దేవుడిచ్చిన వరాలు. తొమ్మిది నెలలు మోసి కన్నావు. కడుపు తీపి తెలియదా? దీన్నీ నేనే పెంచుతా తియ్' అంటూ విసుక్కుంది; తల్లి రాధమ్మ ఖిన్నురాలై నిలబడింది కూతురు చేష్టలకి.



**'మల్లీ! మా అమ్మ, నేను నిన్ను పల్లెత్తు మాటనకుండా ఓర్చుకుంటున్నాం. నీ ప్రవర్తన చూస్తోంటే మాకూ నీ మీద అసహ్యమేస్తోంది. ఇంక నీతో మాకు చేతకాదు. నా పిల్లల్ని నేను చూసుకుంటా. ఫో! నీకు బాగుండే చోటుకే పో'**

ఆస్పత్రిలో తెలిసిన వాళ్ళని చూడాలని వచ్చిన రాములమ్మ ఈ గొడవంతా చూసి 'మీరు ఏమనుకోకండ్రి. ఈ బిడ్డను మీరు వద్దనుకుంటే నాకియ్యండమామ, కడుపులో పెట్టి సాదుకుంటా' అంట వడి పట్టింది. దాంతో మల్లిక అత్త, తల్లి 'లేదులేమ్మా, అదో తిక్క పిల్ల. దాని మాటలకేంలే. మేమంతా లేమా, మా పిల్లను చూసుకోను. మా పిల్ల మాకు బరువా? మాకేమంత పది మందున్నారని' అని సర్ది చెప్పారు. మల్లికలో మార్పు లేదు. పిల్లకు పాలియ్యదు. ముట్టుకోదు. ఇంటికి వచ్చినా ఇదే తంతు. తల్లి వుండీ తల్లిలేని పిల్లలా పోతపాలు పోస్తున్నారు. రమణమ్మకు అసహ్యమేస్తోంది కోడలిని చూస్తే.

రమేశ్‌కి ఒళ్లు మండిపోతోంది. చివరకు ఒకనాడు 'మల్లీ! మా అమ్మ, నేను నిన్ను పల్లెత్తు మాటనకుండా ఓర్చుకుంటున్నాం. నీ ప్రవర్తన చూస్తోంటే మాకూ నీ మీద అసహ్యమేస్తోంది. ఇంక నీతో మాకు చేతకాదు. నా పిల్లల్ని నేను చూసుకుంటా. ఫో! నీకు బాగుండే చోటుకే పో' అన్నాడు కోపంగా. రోషం వచ్చిన మల్లిక 'పోతా, నాకేం భయమా?' అంటూ బయటకు వెళ్ళిపోయింది. కాని పశ్చాత్తాపపడలేదు. తల్లి దగ్గర కెళ్లేసరికి తల్లి, నాయమ్మ 'ఏంటే, నీ మంకుతనం. నీ మాట నీదే గాని పరిస్థితి అర్థం చేసుకోవా. ఛీ! నా కడుపున చెడపుట్టావే. ఎంతో ప్రాణంగా సాకినా, పాముకు పాలు పోసినట్లయింది. నువ్వంటే నాకూ అసహ్యమే, పో. ఎటు పోతావో పో' అంటూ తలుపేసింది. ముసలమ్మ 'సీ ముదనష్టపు దానా. పరువు తీత్తున్నావు గదనే' అంది.

మల్లికకు పౌరుషం వచ్చింది. కాని ఇలా జరుగుతుందనుకోలేదు. తల తిరిగినట్లయింది. ఇరుగు పొరుగు వాళ్లూ కోప్పడ్డారు. 'పోయేకాలం కాకుంటే ఏందిది? సెడిపోతాన్రు పోరగాల్లు 'టి.వి.'లు సీనిమాలు చూసి సీ!' అనుకుంటూ ఇంట్లోకి పోయింది ఒకామె. 'ఏంటమ్మా ఇది. ఎవరైనా ఇట్ల చేత్తున్నారు. ఏమయింది నీకు, లోకంలో నీకొక్క దానికే పుట్టిన్రా పిల్లలు. అసంటప్పుడు పెండ్లెందుకు సేసుకున్నావు. బంగారం లాంటి కాపురం... దేవుళ్ళాంటి అత్త, భర్త. వాళ్లని ఘోస పుచ్చుకుంటాంది. ఇటు తల్లి తలెత్తలేక పోతాంది. తండ్రిని మింగినా నిన్ను పాణమెత్తుగా పెంచింది. అప్పుడే నిన్ను అసహ్యించుకున్నా. సంపినా ఈనాడు నువ్వుందువా. సీ, ఏం బుద్ధులివి? ఒళ్లు కావరం' అంటూ చివాట్లేశారు.

తిక్క తిరిగింది మల్లికకు. వాకిట్లో చతికిలబడి ఏడవడం మొదలెట్టింది. వాస్తవాన్ని గ్రహించింది. ఆమెలోని తల్లి మనసు మేల్కొంది. అటు భర్త, ఇటు తల్లి పొమ్మన్నారు. ఏం చేస్తుంది? తన మాట నెగ్గలేదని అలా చేసింది. ఇప్పుడు సిగ్గు పడుతోంది. చేసేది లేక పొరుగింటి రంగయ్య తాత కాళ్ల మీద పడి 'నన్ను క్షమించు తాతా. పిచ్చిదానిలా ప్రవర్తించాను. నాకాపురం నిలబెట్టు తాతా. నాకు బుద్ధొచ్చింది. నా బిడ్డలు నాకు కావాలి. నువ్వే ఎట్లన్న చెయ్యి. నీ మాట దాటను' అని భోరున ఏడ్చింది. రంగయ్య 'లే బిడ్డా! ఇట్ల నేనా చేసేది. అసలే బాలెంతవు. అంతా సక్కబడతది తియ్' అని ఓదార్చి, తలొక మాట అంటున్న అమ్మలక్కలను 'ఇగా చాలు తియ్యండి' అని మల్లికను తన ఇంట్లోకి తీసుకెళ్ళి స్థిమితపడ్డాక బుద్ధులు చెప్పి, రాధమ్మను పిలిచి, అందరూ కలిసి మల్లికను అత్తవారింటికి తీసుకెళ్ళారు.

రంగయ్య 'రమేశుబాబూ! జరిగిన దానికి శానా బాధపడుతున్నాను. తెలివితక్కువ తనంతో మూర్ఖంగా ప్రవర్తించింది. ఇప్పుడు తన తప్పు తెలుసుకుంది. పెద్ద మనసుతో క్షమిస్తావనుకుంటున్నా. పిల్లలకు తల్లిని దూరం చెయ్యకూడదు నాయనా. ఇందులో నీ తప్పుగాని, మీ అమ్మ తప్పుగాని ఏమీ లేదయ్యా. అంతా నాకు తెలుసు. సిన్నప్పటి సంధీ మంకు పోరి. అమ్మా, రమణమ్మా! దాన్ని క్షమించి నీ కడుపులో పెట్టుకోవాల. బాబూ రమేశూ! పెద్దవాడిని సెపుతాన్నా. నా మాట కాదనకయ్యా. ఇగ మీదట ఏ గొడవలు రావు. నా మాట నమ్ము' అంటూ రమేశ్ చేతులు పట్టుకున్నాడు. అప్పటి వరకు తల వంచుకు నిల్చున్న మల్లిక అత్తకు, భర్తకు మొక్కి లోపలికి వెళ్లి పిల్లలిద్దర్ని అక్కున చేర్చుకుని ముద్దులతో ముంచెత్తింది. మాతృత్వంలోని మాధుర్యం మనసారా ఆస్వాదిస్తున్న మల్లికను చూసి అందరూ 'హమ్మయ్య' అని గుండెల మీద చెయ్యి వేసుకుని హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. పిల్లలకు తల్లి దగ్గరయినందుకు, మల్లికాపురం చక్కబడినందుకు.

రమణమ్మ సంతోషంగా 'రంగయ్య నాయనా, పదినమ్మా అందరూ ఇక్కడనే చేయి కడగాల ఈ పేళ, బాబూ రమేశు నువ్వు బండి మీద పోయి నాయనమ్మను సుతా తీసుకురా నాయనా' అని వంట ప్రయత్నానికి లోపలకు వెళ్ళింది, వెంట రాధమ్మ కూడా నడిచింది.

★